



# మన భానుపురి

ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

శుక్రవారం 21 ఆగష్టు 2026 ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం పేజీలు :- 3





# అర్హులైన ప్రతి ఒక్కరికి 15 రోజుల్లో రేషన్ కార్డులు







భానుపురి/సూర్యాపేట ప్రతినిధి

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంఅధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పంపిణీ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలు మరియు నీటి పారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డులు అందక అర్హులైన ఎందరో పేదలు ఇబ్బంది పడ్డారని మండిపడ్డారు. తాను మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి పౌరసరఫరాల శాఖను ప్రజల చెంతకు చేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రేషన్ దుకాణాల ద్వారా ఇచ్చిన దొడ్డు బియ్యాన్ని దాదాపు 80 నుండి 90 శాతం మంది ప్రజలు తినలేకపోయేవారని మంత్రి గుర్తు చేశారు. ఆ బియ్యాన్ని కేవలం ఐదు, పది రూపాయలకే అమ్ముకోవడం లేదా రీసైక్లింగ్ చేసి బీర్ల కంపెనీలకు, కోళ్ల ఫారాలకు తరలించేవారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం ఈ దుస్థితిని మార్చేందుకు దేశంలోనే తొలిసారిగా తెల్ల రేషన్ కార్డుదారులందరికీ ఉచితంగా నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ చేసే చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3 కోట్ల 42 లక్షల మంది పేదలు లబ్ధి పొందుతున్నారని ఆయన వివరించారు. 16 లక్షల కొత్త కుటుంబాలకు రేషన్ కార్డులు గత పదేళ్లలో అర్హులకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వకుండా కాలయాపన చేశారని మంత్రి విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే



కొత్తగా 16 లక్షల కుటుంబాలను రేషన్ పరిధిలోకి తీసుకువచ్చిందని, తద్వారా లబ్ధిదారుల సంఖ్యను పెంచామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.06 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ఆహార భద్రత కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రాబోయే 15 రోజుల్లో సూర్యాపేట జిల్లాలోని అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికీ రేషన్ కార్డుల పంపిణీ పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ హామీ ఇచ్చారు.

**రైతులకు సకాలంలో రూ. 90 వేల కోట్లు**

రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్న మంత్రి.. ఈ రెండున్నరేళ్ల పాలనా కాలంలో రైతుల నుంచి రికార్డు స్థాయిలో వరి ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన 48 గంటల్లోనే ఎలాంటి



ఆలస్యం లేకుండా నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ. 90 వేల కోట్లను జమ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. 1999 నుంచి ఒకే ప్రాంతం, ఒకే పార్టీ నుంచి తనను వరుసగా 6 సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా మొత్తం 7 సార్లు గెలిపించి గుండెల్లో పెట్టుకున్న జిల్లా ప్రజలకు ఉత్తమ్ కుమార్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తనతో పాటు తన సతీమణి పద్మావతి ఎల్లప్పుడూ జిల్లా ప్రజల సేవలో అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత సన్న బియ్యం వంటి సంక్షేమ పథకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తుందని పునరుద్ఘాటించారు. తదుపరి సర్వీస్ లో మరణించిన



ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతి రెడ్డి, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల శామ్యూల్, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కే నరసింహ, పేరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, , అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, డి సి ఓ మోహన్ బాబు, గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, సూర్యాపేట ఆర్డిఓ వేణుమాధవ్ అధికారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ పనితీరు అద్భుతం



భానుపురి /సూర్యాపేట ప్రతినిధి

సూర్యాపేట మార్కెట్ కమిటీ పనితీరు అద్భుతంగా ఉందని రాష్ట్ర ఇరిగేషన్ , పౌరసరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట మార్కెట్ యార్డులో 3 కోట్ల 80 లక్షల రూపాయలతో నిర్మాణం చేపట్టనున్న పలు రకాల మౌలిక వసతులు, మార్కెట్ షెడ్, సోలార్ ప్లాంట్ల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ నందు రైతులకు ఉచితంగా అల్పాహారం అందించడం, 5/- లకు మధ్యాహ్న భోజన వసతి కల్పించడం హర్షనీయమని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకం అమలు చేయాలని మార్కెటింగ్ శాఖ మంత్రికి చెప్తానని అన్నారు. మార్కెట్ లో



పనిచేసే కార్మికులకు, సిబ్బందికి ఏకరూప దుస్తులు అందజేయడం, కూల్ వాటర్ సౌకర్యాం కల్పించడం పట్ల అభినందనలు తెలిపారు. సూర్యాపేట మార్కెట్ కమిటీ పనితీరు బాగుందని తాను మళ్ళీ ఒకసారి వచ్చి రెండు గంటల సమయం మార్కెట్లో గడుపు తానని, మార్కెట్ ను పరిశీలిస్తానని ఆయన అన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ లో అభివృద్ధి కోసం 95 లక్షల రూపాయలు అందజేస్తామని, అలాగే మామిడి మార్కెట్ కు 10 ఎకరాల స్థలాన్ని కేటాయించ వలసిందిగా జిల్లా కలెక్టర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్, ఎస్పి నరసింహ,సూర్యాపేట ఆర్డిఓ వేణు మాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, సెక్రటరి ఫక్రద్దిన్, డైరెక్టర్ లు పాల్గొన్నారు

## సూర్యాపేట లోని ప్రతి వార్డును అభివృద్ధి చేస్తాం



భానుపురి/ సూర్యాపేట టౌన్

ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తూ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి తెలిపారు.గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 38వ వార్డు సత్రం బజార్ లో మున్సిపాలిటీ నిధుల నుంచి రూ.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. వర్షాకాలంలో మురుగు నీటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారంగా సీసీ డ్రైన్ నిర్మాణాన్ని చేపట్టామని తెలిపారు. పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మున్సిపాలిటీ కట్టుబడి ఉందని, రోడ్లు, డ్రైన్లు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని చెప్పారు. ప్రజల సహకారంతో సూర్యాపేటను మరింత అభివృద్ధి చెందిన పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, స్థానిక కౌన్సిలర్ గండూరి రమేష్ , కౌన్సిలర్ నాగుల వాసు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారు వెంకన్న, ఫరూక్, తదితరులు పాల్గొన్నారు.

# పోరాడితే పోయేదేముంది బానిస సంకెళ్లు తప్ప







భానుపురి /సూర్యాపేట టౌన్

ప్రజల సౌకర్యార్థం కేంద్రం మంజూరు చేసిన బుల్లెట్ ట్రైన్ కుట్రలతో పక్కదారి పట్టిస్తున్న పుడు బుల్లెట్ ట్రైన్ ను సాధించేందుకు పోరాడితే పోయేదేముంది బానిస సంకెళ్లు తప్ప అని రైతు కూలి సంఘం జిల్లా నాయకులు బోడ బాలస్వామి అన్నారు. బుల్లెట్ ట్రైన్ సాధన అఖిలపక్ష పోరాట సమితి కొనసాగిస్తున్న దీక్షలు ఏడవ రోజు రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో దీక్షలో పాల్గొని ఆయన మాట్లాడాను. ఈ సందర్భంగా తమ కళాకారులతో దీక్ష వేదికపై సంస్కృతి కార్యక్రమాలతో పాటు బుల్లెట్ ట్రైన్ దారి మళ్ళీంపు పై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టసభల్లోను ఎన్నికల ప్రచారాల్లోను ప్రజల కోసం ప్రాణాలైనా ఇస్తామంటూ ప్రగల్బాలు పలికే పాలకులు కేంద్రశీ బుల్లెట్ ట్రైన్ సూర్యాపేట మీదుగా వెళ్లే విధంగా ప్రకటిస్తే పక్కదారి పట్టించేందుకు కుట్రలు పన్నుతున్న తీరు పట్ల నోరు మెదపని నేతల పై మండిపడ్డారు. సూర్యాపేట కు ఇప్పటికే రైలు మార్గశీ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్న ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు స్పందించాలన్నారు.మొదటి అలైన్మెంట్లో నేషనల్ హైవే 65 మీదుగా మంజూరైన బుల్లెట్ ట్రైన్ ను కొనసాగే విధంగా ప్రతిపాదనలు పంపాలని బుల్లెట్ ట్రైన్ ఉద్యమానికి సహకరించి సూర్యాపేట ప్రజలను ఆదుకోవాలని ఆయన అన్నారు. ఈ దీక్షలో రైతు కూలి సంఘం నాయకులు బయ్య రామచంద్రూ బెల్లి నాగరాజు, కుంచం వెంకన్న, బయ్య సతీష్ కోడి బాబు, ఇరుగు వెంకటేశ్, బయ్య లింగయ్య బత్తుల గుర్వయ్య బయ్య గంగయ్య, సత్తుపల్లి రాములు, ఇరుగు నాగయ్య, వెంకన్న రమేష్, కృష్ణయ్య శ్రీనివాస్ రెడ్డి పుల్లారెడ్డి, కొమురయ్య సత్తయ్య పన్నీరు వాసుదేవరావు, పాల్గొన్నారు.

**దీక్షకు సంఘీభావం..**

రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో దీక్షలో పాల్గొన్న వారికి సంఘీభావంగా అఖిలపక్ష నాయకులు ధర్మార్జున్, నెమ్మది వెంకటేశ్వర్లు, కొత్తపెల్లి శివకుమార్, డేవిడ్ కుమార్, చలమల్ల నరసింహ, జీడి బిక్షం, వనితక్క, సట్టు నాగయ్య ,బొమ్మిడి లక్ష్మీ నారాయణ, పేర్ల నాగయ్య, మట్టి పెల్లి సైదులు, నవిలే ఉపేందర్, కిరణ్, ఎర్ర అఖిల్ కుమార్, ఉపాధి కోసం వచ్చి పట్టణంలో స్థిరపడ్డ పంజాబ్ యువకులు ఈ దీక్ష కు సంఘీభావం తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు దీక్షను విరమించారు.

## కమిషనర్ కి వినతి పత్రం ఇచ్చిన బి ఆర్ ఎస్ పార్టీ కౌన్సిలర్లు

భానుపురి/సూర్యాపేట టౌన్



సూర్యాపేట జిల్లా కేంద్రం లో గల స్థానిక మున్సిపల్ ఆఫీసు నందు సూర్యాపేట పట్టణ మున్సిపల్ కమిషనర్ ను తెలంగాణ రాష్ట్ర తొలి విద్యుత్తు శాఖ మంత్రి సూర్యాపేట నియోజకవర్గ ఎం ఎల్ ఏ గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆదేశాల మేరకు అంగిరేకుల నాగార్జున ఆధ్వర్యంలో బి ఆర్ ఎస్ పార్టీ కౌన్సిలర్లు మున్సిపాలిటీ లో నెలకొన్న పలు సమస్యలపై కలిసి,వినతి పత్రం ఇవ్వటం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ పెన్షన్లు రాజకీయాలకు అతీతంగా నిజమైన లబ్ధిదారులను గుర్తించి ఇవ్వాలి అని రాబోయే పండుగ ల ను దృష్టిలో ఉంచుకొని పట్టణ వ్యాప్తంగా అండర్గ్రౌండ్ డ్రైనేజ్ పనులు త్వరగతిన పూర్తి చేయాలి అని ప్రధానంగా నీటి సరఫరా కోసం మెరుగైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని,విచ్చలవిడిగా పెరిగిన కుక్కల ను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని,సూర్యాపేట పట్టణ ప్రజల పక్షాన వినతి పత్రం ఇవ్వటం జరిగింది అని అన్నారు. ఈ కార్యక్రమం లో గండూరి పావని కృపాకర్, ఈద ప్రవీణ్, తాహెర్ బిన్ పాషా, భూక్యా జ్యోతి లింగ నాయక్, ధారావత్ విజయ చక్రు నాయక్, బత్తుల ఝాన్సీ రమేష్,పోతురాజు ఇందుశ్రీ అనిల్, చిరివెళ్ళ లక్ష్మీ కాంతమ్మ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఊపిరితిత్తుల శస్త్రచికిత్సలకు భయపడాల్సిన అవసరం లేదు


భానుపురి/సూర్యాపేట టౌన్

ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులకు ప్రస్తుతం అత్యాధునిక శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని, ఊపిరితిత్తుల శస్త్రచికిత్సలు ప్రమాదకరమనే అపోహను ప్రజలు వీడాలని యశోద ఆసుపత్రి సోమాజిగూడ శాఖకు చెందిన థొరాసిక్ సర్జన్ డాక్టర్ రోహన్ రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో త్రిబుల్ ఆర్ ఫంక్షన్ హాల్ వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ థొరాసిక్ సర్జరీ అంటే కేవలం గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స కాదని, గుండెకు సంబంధించిన శస్త్రచికిత్సలను కార్డియో థొరాసిక్ సర్జరీగా పిలుస్తారని తెలిపారు. ఊపిరితిత్తులు, ఛాతీ భాగానికి సంబంధించిన శస్త్రచికిత్సలకు ప్రత్యేకంగా థొరాసిక్ సర్జరీ అనే విభాగం ఉందన్నారు. ముఖ్యంగా కొవిడ్ తర్వాత ఊపిరితిత్తుల వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెరిగిందని చెప్పారు. ఊపిరితిత్తులకు సంబంధించిన అనేక సమస్యలకు ప్రస్తుతం ప్రత్యేక శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. యశోద ఆసుపత్రి సోమాజిగూడలో పల్మనాలజీ, థొరాసిక్ సర్జరీ సేవలను 24 గంటలూ అందిస్తున్నామని చెప్పారు. అదేవిధంగా ఊపిరితిత్తుల మార్పిడి (లంగ్ ట్రాన్స్ప్లాంట్) సేవలను కూడా ప్రారంభించామని, ఇప్పటికే విజయవంతంగా శస్త్రచికిత్సలు నిర్వహించి పలువురు రోగులు కోలుకుని ఆరోగ్యంగా ఉన్నారని వివరించారు. ఎండ్ స్టేజ్ లంగ్ డిసీజ్‌తో బాధపడుతున్న వారికి ఊపిరితిత్తుల మార్పిడి కొత్త జీవితాన్ని అందించే అవకాశముందని డాక్టర్ రోహన్ రెడ్డి తెలిపారు. ఇంటర్‌స్టీషియల్ లంగ్ డిసీజెస్, ధూమపానం కారణంగా వచ్చే సీఓపీడీ వంటి వ్యాధుల్లో ఒక దశ తర్వాత ఊపిరితిత్తుల పనితీరు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంటుందని చెప్పారు. అలాంటి రోగులు శ్వాస తీసుకోవడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడుతూ, ఆయాసంతో జీవన్మరణ పరిస్థితిని ఎదుర్కొంటారని, వారికి లంగ్ ట్రాన్స్ప్లాంట్ ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. క్షయ వ్యాధి కారణంగా ఊపిరితిత్తుల్లో కొంత భాగం దెబ్బతినడం, దగ్గులో రక్తం పడటం, ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి సమస్యలకు కూడా శస్త్రచికిత్స అవసరం కావచ్చని తెలిపారు. ప్రస్తుతం ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు ఆధునిక పద్ధతుల్లో శస్త్రచికిత్సలు చేస్తున్నామని చెప్పారు. మినిమల్ ఇన్వేసివ్ థొరాసిక్ సర్జరీ ద్వారా చిన్న కోతలతోనే ఊపిరితిత్తుల్లోని వ్యాధిగ్రస్త భాగాన్ని తొలగించే అవకాశం ఉందన్నారు. సాధారణంగా ఒకటి నుంచి రెండు సెంటీమీటర్ల పరిమాణంలో చిన్న కోతలతో శస్త్రచికిత్స చేయడం వల్ల రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. దీనికి మరింత ఆధునిక రూపంగా రోబోటిక్ థొరాసిక్ సర్జరీ అందుబాటులోకి వచ్చిందని, యశోద ఆసుపత్రిలో ఈ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. గతంలో ఊపిరితిత్తుల శస్త్రచికిత్స అంటే చాలా ప్రమాదకరమని భావించి రోగులు భయపడేవారని, ప్రస్తుతం ఆధునిక వైద్య సాంకేతికతతో ఈ శస్త్రచికిత్సలు సురక్షితంగా నిర్వహించగలుగుతున్నామని డాక్టర్ రోహన్ రెడ్డి పేర్కొన్నారు. సూర్యాపేట, ఖమ్మం ప్రాంతాల నుంచి కూడా పలువురు రోగులకు శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. తాను కూడా సూర్యాపేటకు చెందినవాడినని, తన ప్రాంత ప్రజలకు ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలు ఉంటే భయపడకుండా నిపుణులైన వైద్యులను సంప్రదించాలని సూచించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల్లో ఎవరికైనా ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలు ఉంటే ఈ సమాచారాన్ని వారికి చేరవేయాలని మీడియా ప్రతినిధులను కోరారు. ఊపిరితిత్తుల శస్త్రచికిత్సలు ఇకపై భయపడాల్సినంత ప్రమాదకరమైనవి కావు. ఆధునిక మినిమల్ ఇన్వేసివ్, రోబోటిక్ థొరాసిక్ సర్జరీలతో సురక్షితంగా చికిత్స అందించవచ్చు. అవసరమైన రోగులకు లంగ్ ట్రాన్స్ప్లాంట్ కూడా సాధ్యమే. సరైన సమయంలో నిపుణులను సంప్రదిస్తే మెరుగైన చికిత్స అందించవచ్చు" అని డాక్టర్ రోహన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో యశోదా ఆసుపత్రి సీనియర్ మేనేజర్ ఉమేష్, అసిస్టెంట్ మేనేజర్ రాంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.




# దేశ యువతకు రాజీవ్ ఒక స్ఫూర్తి

భానుపురి/సూర్యాపేట టౌన్



దేశంలో సాంకేతిక విప్లవం తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీదే అని డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది మున్సిపల్ వైస్ చైర్మన్ యం.డి. షఫీ ఉల్లా అన్నారు. స్వర్గీయ మాజీ ప్రధాని,భారత రత్న, దివంగత నేత రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ ఆధ్వర్యంలో జమ్మిగడ్డలో రాజీవ్ విగ్రహనికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మర ణీయమన్నారు. పల్లెలే దేశానికి పట్టుకొమ్మలన్న మహాత్మా గాంధీ మాటలను రాజీవ్ నిజం చేశారన్నారు.రాజ్యాంగ సవరణలు తీసుకొచ్చి గ్రామ పంచాయతీలకే సర్వ హక్కులు, అధికారాలు కల్పించారు రాజీవ్ గాంధీ. స్థానిక సంస్థలను బలోపేతం చేశారు.దేశంలో మహిళలకు స్థానిక సంస్థల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించారు. పరిపాలనలో సమూల మార్పులు తెచ్చి పేదల చేతిలో అధికారం పెట్టారు" అని అన్నారు. సాంకేతిక విప్లవం తీసుకు వచ్చింది రాజీవ్ గాంధీ అని ఆయన గుర్తు చేశారు. "ఐటీ రంగంలోనే కాదు, టెలికాం రంగంలోనే సమూల మార్పులు తెచ్చి మారుమూల పల్లెలకు చేర్చారు. దేశంలో యువకులకు రాజీవ్ ఒక స్ఫూర్తినిచ్చారు. దేశ సమగ్రత కోసం, సమైక్యత కోసం ప్రాణాలు అర్పించిన కుటుంబం రాజీవ్ గాంధీ కుటుంబం. ఆయన జయంతి సందర్భంగా దేశం కోసం ఆయన చేసిన సేవలను, ప్రాణత్యాగాన్ని గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. వారి స్ఫూర్తితో మళ్లీ దేశ సమగ్రతను కాపాడేందుకు పునరంకితమవుదాం" అని తెలిపారు. యువతకు 18 సంవత్సరాలకే ఓటు హక్కును కల్పించిన ఘనత రాజీవ్ గాంధీ ది అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలకు, నాయకులకు భవిష్యత్తులో రాజకీయంగా, సామాజికంగా ఉన్నత పదవుల్లో అవకాశాలు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరు రాజీవ్ గాంధీ ఆశయాలను ఆదర్శంగా చేసుకొని కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టే ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి విజయవంతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు....

## ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు



భానుపురి/సూర్యాపేట టౌన్

ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు అని ఓటు హక్కు ను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, సూర్యాపేట నియోజకవర్గ సమన్వయకర్త కుసుబా శ్రీనివాస్, అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం సర్ ఫేజ్ 2 పై అవగాహన కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు నియోజకవర్గాల్లో రెండు లక్షల పైగా ఓట్లను డ్రాప్ లిస్టులో పెట్టారని ఆరోపించారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని బిఆర్ ఎస్ పార్టీ ఎలక్షన్ కమిషన్ ఏజెంట్ గా పని చేస్తున్నాయని దుయ్యబట్టారు. డ్రాప్ లిస్టులో వచ్చిన ఓటర్ లు అధైర్య పడకుండా ఫామ్ 8 ద్వారా మార్చుకునే అవకాశం ఉంటుందని భరోసా కల్పించారు. 13 రకాల కారణాలతో ఓట్లను తీసేసారని బి ఎల్ వో ల ద్వారా ఎన్యూమరేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఓటు బ్యాంకు ను కాపాడేలా బిఎల్ఏలు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్, మాజీ కౌన్సిలర్ లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాధికారం దిశగా బీసీలు ఐక్యం కావాలి

భానుపురి/ హైదరాబాద్




దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా బీసీలు ఇంకా తమ హక్కులు, వాటాల కోసం ఇతరులను వేడుకునే పరిస్థితిలో ఉండటం మంచిది కాదని, ఇకనైనా చైతన్యవంతులై రాజ్యాధికారమే లక్ష్యంగా సంఘటితం కావాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ పిలుపునిచ్చారు. జనాభాలో అత్యధిక శాతంగా ఉన్న బీసీలు రాజకీయంగా ఐక్యమైతే రాబోయే రోజుల్లో రాజ్యాధికారం సాధించడం అసాధ్యం కాదని ఆయన పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లో 'మన ఆలోచన వేదిక' ఆధ్వర్యంలో నిర్వహించిన ఆలె నరేంద్ర వర్ధంతి కార్యక్రమంలో జానయ్య యాదవ్ పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటుతున్నప్పటికీ ఇప్పటికీ 'సామాజిక న్యాయం' కోసం బడుగు, బలహీన వర్గాలు డిమాండ్ చేయాల్సి రావడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆలోచించాల్సిన అంశమన్నారు. సామాజిక న్యాయం కోసం నిరంతరం అభ్యర్థించే స్థాయి నుంచి, దానిని అమలు చేసే రాజకీయ అధికారాన్ని సాధించే స్థాయికి బీసీలు ఎదగాలని కోరారు.

**హక్కులు అడగడం కాదు.. అధికారం సాధించాలి**

ఇంతకాలం బీసీలు తమకు రాయితీలు ఇవ్వాలని, అవకాశాలు కల్పించాలని, న్యాయం చేయాలని పాలకులను కోరుతూ వచ్చారని జానయ్య యాదవ్ అన్నారు. ఇకపై తమ జనాభాకు తగిన రాజకీయ, ఆర్థిక, సామాజిక వాటా కోసం ప్రశ్నించాల్సిన సమయం వచ్చిందన్నారు. రాజకీయ నిర్ణయాలు తీసుకునే స్థానాల్లో బీసీలు తగిన ప్రాతినిధ్యం పొందకుండా సామాజిక న్యాయం సంపూర్ణంగా సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. బీసీలలోని వివిధ కులాలు తమ సామాజిక అస్తిత్వాన్ని, సంఘటిత శక్తిని బలోపేతం చేసుకుంటూనే ఉమ్మడి రాజకీయ లక్ష్యం కోసం ఒక్కటవ్వాలని ఆయన సూచించారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, ఇతర బడుగు బలహీన వర్గాలు పరస్పర విభేదాలను పక్కనపెట్టి జనాభా దామాషా ప్రకారం అవకాశాలు, వనరులు, అధికారంలో వాటా కోసం ఐక్యంగా పోరాడాలని కోరారు.

**విభజనతోనే రాజకీయంగా బలహీనపడ్డాం**

ఒక కుటుంబంలో అన్నదమ్ములు విడిపోయినప్పుడు ఆస్తిలో తమకు రావాల్సిన సమాన వాటా కోసం ప్రశ్నిస్తారని, కానీ దేశ సంపదలో, రాజకీయ అధికారంలో తమ వాటా ఎంత అనే ప్రశ్నను బడుగు వర్గాలు బలంగా ముందుకు తీసుకురాలేకపోయాయని జానయ్య యాదవ్ పేర్కొన్నారు. బీసీల మధ్య కులాల పేరుతో విభేదాలు సృష్టించడం వల్ల వారి రాజకీయ శక్తి చీలిపోయిందని అన్నారు. "మన మధ్య తగాదాలు పెట్టి, మన ఓట్లతోనే కొద్దిమంది అధికారంలోకి వచ్చి తిరిగి మనపైనే అధికారం చెలాయించే పరిస్థితి కొనసాగుతోంది. ఈ రాజకీయ పద్ధతికి ఇక స్వస్తి పలకాలి. మన ఓటు మన రాజకీయ భవిష్యత్తును నిర్ణయించే ఆయుధంగా మారాలి" అని ఆయన పిలుపునిచ్చారు. ఆలె నరేంద్ర పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి .బడుగు, బలహీన వర్గాల రాజకీయ చైతన్యం కోసం కృషి చేసిన ఆలె నరేంద్ర పోరాట స్ఫూర్తిని నేటి తరం ముందుకు తీసుకెళ్లాలని జానయ్య యాదవ్ అన్నారు. ఆయన వర్ధంతి కేవలం స్మరణ కార్యక్రమంగా మిగిలిపోకుండా బీసీల రాజకీయ ఐక్యతకు సంకల్ప వేదికగా మారాలని ఆకాంక్షించారు. రాజకీయ పార్టీలు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూసే పరిస్థితి మారాలంటే బీసీల్లో రాజకీయ చైతన్యం పెరగాలని అన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నాయకత్వాన్ని నిర్మించుకుంటూ, చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం సాధించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. రాజ్యాధికారమే పరమావధిగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాలు సంఘటిత పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మన ఆలోచన వేదిక వ్యవస్థాపకుడు కటకం సుదర్శన్, బీసీ మేధావుల సంఘం రాష్ట్ర వ్యవస్థాపకుడు చిరంజీవులు వాసుకి యాదవ్ ,బొంగు ప్రసాద్ గౌడ్ ,తో పాటు పలువురు బీసీ మేధావులు, సామాజిక సంఘాల ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# మందలిస్తే... మట్టుబెడతారా?

చదువు, బుద్ధి, క్రమశిక్షణ నేర్పినగురువునే పరమ కిరాతకంగాపైశాచిక హింసకు బలిచేయడంమానవత్వానికే మాయని మచ్చ!

తమ జీవితానుభవాల నుంచిమంచి--చెడులను వివరిస్తూ..భవిష్యత్తుకు బాటలు వేస్తూ.....విద్యార్థుల హృదయాల్లో జ్ఞానజ్యోతులు వెలిగిస్తూ..వారి బంగారు భవితకు రహదారి చూపిన
ఆ పాఠశాల ప్రిన్సిపాల్‌ను
కనీస మానవత్వం లేకుండా
కర్కశంగా హతమార్చడం
సమాజాన్ని కలచివేసే దారుణం!

అప్పుడప్పుడే నూనూగు మీసాలతో రేపటి పౌరులుగా ఎదుగుతున్న యువత...
ఒక మంచి మాటను,
ఒక మందలింపును కూడా
ఓర్చుకోలేక విచక్షణ కోల్పోయి,తమ జీవితాలకు వెలుగునిచ్చేఆ తల్లి లాంటి అధ్యాపకురాలినిండు ప్రాణాన్ని హరించడంఈ లోకం ఎన్నటికీ క్షమించలేని నేరం!

గురువు మందలింపులోనూ
విద్యార్థి భవిష్యత్తుపై ప్రేమే ఉంటుంది;ఆ మాటలో ఆగ్రహం కాదు---
అతని జీవితాన్ని తీర్చిదిద్దాలనే
బాధ్యత దాగి ఉంటుంది.
అలాంటి పవిత్రమైన గురు స్థానాన్నిగౌరవించాల్సిన చేతులేహత్యకు పాల్పడటం
విద్యా వ్యవస్థకు, మానవ విలువలకుతీరని అవమానం.

ఈ ఘాతుకానికి పాల్పడిన వారికిచట్టప్రకారం కఠిన శిక్ష పడక తప్పదు .వారిని ఎంతో అపురూపంగా, ఆప్యాయతతో కని పెంచిన కన్న తల్లిదండ్రులకు మాత్రం గర్భ శోకం తీరదు. ఆజన్మాంతం మనోవేదన,
తీరని పశ్చాత్తాపం,
నరకయాతనలా మారిన జ్ఞాపకాలే మిగులుతాయి.

ఇకనైనా ప్రభుత్వం స్పందించాలి.పాఠశాలల్లో ఉపాధ్యాయుల భద్రతకు
మరింత పటిష్ఠమైన రక్షణ కల్పించాలి.

పిల్లల్లో కలిగే మానసిక ప్రవర్తనను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ తల్లి దండ్రులు,టీచర్స్ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. సాధ్యమైనంత వరకు ఫోన్ ఊబి నుండి కాపాడాలి.

గురువును కాపాడటం అంటేవిద్యను కాపాడటం...
విద్యను కాపాడటం అంటే
భావితరాల భవిష్యత్తును కాపాడటమే!

గురువు మీద చేయి లేస్తే...
అది ఒక్క మనిషిపై దాడి కాదు---
సమాజపు జ్ఞానదీపంపైనే దాడి!

గుండవరం ప్రభాకర్ రావు
ఫోన్ నం. 9949267638
అత్వెల్లి గ్రామం, మేడ్చల్ జిల్లా.

## పొద్దంతా బిజీగా... సాయంత్రం సరదాగా!





భానుపురి/సూర్యాపేట

పొద్దంతా ప్రజా కార్యక్రమాలతో బిజీబిజీగా గడిపిన అనంతరం, సాయంత్రం సరదాగా తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమన్న, పద్మావతి తో సర్వోత్తమ రెడ్డి.. ప్రజా సేవలో నిరంతరం బిజీ... ఆత్మీయులతో మాత్రం ఎప్పుడూ సరదానే!

## భారత దేశం లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విప్లవానికి శ్రీకారం చుట్టింది రాజీవ్ గాంధీయే




భానుపురి/సూర్యాపేట టౌన్

భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా సూర్యాపేట పట్టణం లోని జమ్మిగడ్డ యందు గల రాజీవ్ గాంధీ చిత్ర పటానికి నివాళులు అర్పించిన మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్, ఈ సందర్భంగా వారు మాట్లాడుచు రాజీవ్ గాంధీ దార్శనికత, దూరదృష్టి గల నాయకుడని, భారత దేశం లో ఐటి విప్లవానికి శ్రీకారం చుట్టడం ద్వారా ఆధునిక భారతానికి పునాదులు వేశాడని, భారత దేశం కోసం తన జీవితం అర్పించిన ప్రజా నాయకుడని కొనియాడారు,ఇట్టి కార్యక్రమం లో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు వేములకొండ పద్మ, జిల్లా మైనారిటీ నాయకులు అమజద్ అలీ, ఇస్రర్ అహ్మద్,మన్సూర్ భాయ్,సాజిద్ ఖాన్, కౌన్సిలర్ వెంకటి శేఖర్ రెడ్డి,కనుకు వెంకన్న,హరి సార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు

# నేటి మనిషికి డిజిటల్ సంకెళ్లు..

భానుపురి ప్రతినిధి




చేతివేళ్లపై
డిజిటల్
ప్రపంచం
నడుస్తోంది,
హస్తభూషణమై నిత్యం నాట్యమాడుతోంది!
మనుషుల మధ్య మమకారపు దారం తెంచి,
ఆత్మీయ బాంధవ్యాలను తుంచేస్తోంది...

సెలైన్ చుక్కలా రక్తం లోకి ఇంకుతూ,
యాప్‌ల మత్తులో మనసును ముంచుతూ,
నిశ్శబ్దంగా నరనరాల్లోకి ప్రాకుతూ,
మనిషికి మరో ప్రాణమై నిలిచింది!

లైక్‌ల కొలతలతో విలువలు వేసుకుంటూ,
ఆత్మగౌరవాన్ని త్రాసులో తూచుకుంటూ,
కామెంట్ల పొగడ్తల్లో మురిసిపోతూ,
మనిషి తన నిజమైన ఉనికినే కోల్పోతున్నాడు...

నోటిఫికేషన్ శబ్దమే ప్రతిధ్వనిస్తూ,
అదియే గుండె చప్పుడుగా మారిపోతూ,
కాలం చేతిలోని ఇసుకలా జారిపోతుంటే,
ఈ నిజాన్నే మనం మరచిపోయాం!

స్వేచ్ఛగా ఎగరాల్సిన రెక్కలు ముడిచి,
నోటిఫికేషన్ల సంకెళ్లలో నలిగిపోతూ,
మానవ సంబంధాలు మసకబారిపోగా,
తెరపై మెరిసే బొమ్మలకే దాసోహమయ్యాం!

కంటి నిద్రను దొంగిలించిన రంగుల వెలుగు,
కంటి పాపలకు భయంకరంగా మారుతూ,
మనశ్శాంతిని బలికోరే భూతమై,
రాత్రి వేళ కూడా పక్కనే చేరి నిద్రను దిగమింగే!

కృత్రిమ వెలుగులను కాస్త వదిలేద్దాం,
ప్రకృతి ఒడిలోకి అడుగులు వేద్దాం!
నిజమైన ప్రశాంతతను ఆస్వాదిస్తూ,
స్వచ్ఛమైన జీవితాన్ని మళ్లీ ఆరోగిద్దాం!

కొప్పుల ప్రసాద్
నంద్యాల
9885066235